టాప్ న్యూస్



## సంక్రాంతి సినిమాలకు రేటు ఘాటు

- రెండు రాష్ట్రాల్లో పెంపుకు అనుమతులు
- మనశంకర్ వరప్రసాద్ కు ప్రీమియర్స్

02



## బాబు కోసం బండ్ల గణేష్

- షాద్ నగర్ టూ తిరుమల పాదయాత్ర

02



## కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా వెలిచాల రాజేందర్

- పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ ఉత్తర్వులు
- సీఎం రేవంత్ కు కరీంనగర్ కార్పోరేషన్ గిఫ్ట్ గా అందిస్తాం వెలిచాల

02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER APTEL/2014/58382

11-01-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 17 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శనివారం WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## నీళ్ళ రాజకీయానికి పరిష్కారముంటుందా?

నీటి వివాదాలు నిప్పుల కుంపటిగా మారిన తరుణంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రతిపాదన చేశారు. తెలంగాణ కోణంలో ఇది సంచలనమే కాదు సాహసం. తెలంగాణ ఉద్యమ సమయంలో.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక నీళ్ళచుట్టే రాజకీయాలు, ప్రభుత్వాలు తిరిగాయి. నీళ్ళలో రాజకీయమంటలు పుట్టించి బీఆర్ఎస్ గతంలో అనేక ఉద్యమాలు చేసింది. ఒక్క తెలంగాణే కాదు.. దేశంలోని అనేక రాజకీయపార్టీలు సందర్భం వచ్చినపుడల్లా నీళ్ళలోనే నిప్పులు పుట్టిస్తాయి. అలాంటి రాజకీయంతో ముడిపడ్డ నీటివస్తువును రాజకీయాలు పక్కనబెట్టి కూర్చుని పరిష్కారం చేసుకుందాం అని ముఖ్యమంత్రి ప్రతిపాదించడం సంచలనం. సాహసమే. సీఎం రేవంత్ రెడ్డి చేసిన సంచలన ప్రతిపాదన వెనుక అసలు వ్యూహం ఏంటి? వాటర్ వార్ గా మారుతున్న అంతర్రాష్ట్ర పోరులో నిజంగా పరిష్కారం సాధ్యమా? లేక ఇది ప్రతిపక్షాల నీళ్ల రాజకీయాలకు చెక్ పెట్టే మాస్టర్ స్ట్రోకా? బీఆర్ఎస్–వైసీపీ ఒకే అజెండాతో ముందుకెళ్లడం వల్ల రాజకీయంగా నష్టం ఎవరికి? ఐఎఎస్ అధికారులపై ఇంతకుముందెన్నడూ లేని రీతిలో జరుగుతున్న విషప్రచారానికి కారణాలేంటి? చట్టాలు రూపొందించే, వ్యవస్థలను కాపాడే అధికారుల ఆత్మ స్థైర్యం దెబ్బతీయడం వల్ల కలిగే ప్రయోజనాలేంటి? జాతీయ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్న 'లోకేష్ రైజింగ్' వెనుక కథ ఏంటి?

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో

## వరంగల్–హన్మకొండ విలీనం?

ప్రస్తుతం విడివిడిగా ఉన్న వరంగల్, హన్మకొండ జిల్లాలు పరిపాలన పరంగా మళ్లీ ఒకే గొడుగు కిందికి వచ్చే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. రెండు జిల్లాల మధ్య కార్యాలయాల పునరావృతం, అధికారుల సమన్వయ లోపం, ప్రజలకు సేవలలో ఆలస్యం వంటి సమస్యలు ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా ప్రభుత్వం భావిస్తోంది. చారిత్రకంగా, సాంస్కృతికంగా ఒకే గుర్తింపు ఉన్న ఈ ప్రాంతాన్ని ఒకే జిల్లాగా తీర్చిదిద్దితే పాలన వేగవంతమవుతుందన్నది ప్రభుత్వ అంచనాగా ఉంది. చారిత్రక నగరాన్ని విడదీయొద్దని కూడా అక్కడి ప్రజలు కోరుకున్నారు. ఇపుడు కూడా నగరవిలీనం కోసం ఆందోళనలు జరుగుతున్నాయి.



# రేవంత్ వ్యూహం

## జిల్లాల్లో మార్పుచేర్పులకు కమిషన్?

మంత్రి పొంగులేటి సారధ్యంలో ఉపసంఘం

ఎన్నికల సమయంలో జిల్లాల్లో మార్పులపై సీఎం రేవంత్ హామీలు

వాటిని నెరవేర్చేదిశగా కార్యాచరణt

బడ్జెట్ సమావేశాల సమయంలో కమిషన్ ఏర్పాటుచేసే అవకాశం

ఇప్పటికే వరంగల్, హన్మకొండ విలీనం కోసం దీక్షలు.. సికింద్రాబాద్ జిల్లాకు డిమాండ్లు

కరీంనగర్ లో హుస్నాబాద్ కలపాలని మంత్రి పొన్నం డిమాండ్

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ప్రస్తుతమున్న 33 జిల్లాల్లో మార్పులు చేర్పులు జరగనున్నాయి. అస్తవ్యస్థంగా లక్కీ నెంబర్ కోసం జిల్లాలు అశాస్త్రీయంగా విభజించారని, జిల్లాల సరిహద్దుల్లో మార్పులు చేర్పులు జరుగుతాయని ఇటీవల రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో, గెలిచిన తర్వాత కూడా జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రజల ఆకాంక్షలకు, సౌకర్యాలకు అనుగుణంగా జరుగుతుందని చెప్పారు. ఇటీవల ఏపీలో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటుచేయడంతో పాటు పలు జిల్లాల సరిహద్దులు మార్చగా, ఇపుడు తెలంగాణ లో కూడా అదే పద్ధతిలో నిర్మాణాత్మకంగా

మిగతా 2లో



## హుస్నాబాద్ను కరీంనగర్లో కలపడం తథ్యం

- ఇది ప్రజల కోరిక
- మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 2లో

# నాకు ఇంత విషం ఇచ్చి చంపండి

## దుష్ప్రచారంపై మంత్రి కోమటిరెడ్డి భావోద్వేగం

### డీజీపీ, ఇంటెలిజెన్స్ అధికారులను నివేదిక కోరాం



**హైదరాబాద్, మహా:** "మహిళా అధికారులపై చెప్పలేని భాషలో వార్తలు రాయడం హేయమైన చర్య. మీడియా సోదరులకు కూడా ఇంట్లో అక్కాచెల్లెళ్లు ఉంటారు, మీ కుటుంబ సభ్యులపై ఇలాంటి వార్తలు వస్తే ఎలా ఉంటుంది?" అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా సీనియర్ ఐఎఎస్ అధికారులను మానసిక వేదనకు గురిచేయడం సరికాదన్నారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. "నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చచ్చిపోయాను. దేవుడిని నమ్ముకుని ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నాను. నన్ను మానసికంగా ఇబ్బంది పెట్టకండి" అని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారుల వ్యవహారంపై డీజీపీతో మాట్లాడి ఎంక్వైరీ వేయమన్నానని, 20 రోజుల్లో నిజానిజాలు బయటకు వస్తాయని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ల బదిలీలు ముఖ్యమంత్రి నిర్ణయమని, దానికి మంత్రితో సంబంధం పెట్టొదని ఆయన కోరారు.

### ఇన్ ఛార్జి మంత్రిమీద వేశారు

సీఎంవో లో ఒక మహిళ అని వేశారు. ఇంచార్జ్ మంత్రి మీద కూడా వార్తలు వేస్తున్నారు. ఇప్పుడు నల్గొండ మంత్రి అని తప్పుడు వార్తలు వేస్తున్నారు. డీజీపీ తో ఇలాంటి అంశాలపై చర్చించాము. సమగ్రంగా దర్యాప్తు జరిపించాలని డీజీపీ ని కోరాం. డిజిపీ,ఇంటిలిజెంట్ అధికారులకు తప్పుడు వార్తలపై నివేదిక ఇవ్వాలని కోరాం. రిపోర్ట్ వచ్చిన తర్వాత లీగల్ యాక్షన్ తీసుకుంటాం.

మిగతా 2లో

## మహిళా ఐఏఎస్లపై దుష్ప్రచారం

కొన్ని మీడియా సంస్థల చర్యలను ఖండించిన ఐపీఎస్ అసోసియేషన్

ఐఏఎస్ అధికారుల సంఘానికి సంపూర్ణ సంఘీభావం ప్రకటన

02

### మునిసిపల్ ఎన్నికల బరిలో

# తెలంగాణ జనసేన

### పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం.. క్షేత్రస్థాయి నిర్మాణంపై నజర్



**హైదరాబాద్. మహా:** జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ జనసేన విభాగం నిర్ణయించింది. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడం, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భావజాలాన్ని, ఆయన ఆశయాలను, తెలంగాణ ప్రాంతం పట్ల ఆయనకున్న అనుబంధాన్ని ప్రజలకు చేరవేయడం, తద్వారా తెలంగాణలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన నిర్ణయించింది. ఈ మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పేరుతో ప్రకటన విడుదలైంది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే దిశగా, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో పార్టీ ఇప్పటికే కార్యాచరణను ప్రారంభించిందని తెలిపారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, సాధ్యమైనన్ని స్థానాలలో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తున్న జనసైనికులు, వీరమహిళలు చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

**కొలంబియా అధ్యక్షుడిని ఫిబ్రవరిలో కలుస్తా:డొనాల్డ్ ట్రంప్** 2

## పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి



- ట్రిపుల్ ఆర్.. మెట్రో రెండో దశకు అనుమతులు కావాలి
- కేంద్రాన్ని కోరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రీ-బడ్జెట్ సమావేశంలో నిర్మలా సీతారామన్ కు వినతులు

02

### 90 శాతం మునిసిపాలిటీలు

## గెలుస్తాం



- వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ బాధాకరం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

02




## నేను డాక్టర్ ను కాదు.. కానీ, సోషల్ డాక్టర్ను: సీఎం రేవంత్రెడ్డి

**హైదరాబాద్, మహా:** ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు.. వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలరని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి సీఎం రేవంత్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను డాక్టర్ ను కాకపోయినప్పటికీ.. సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్నని సీఎం వ్యాఖ్యానించారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్గ్రేడ్ చేసుకోవాలని.. అయితే, ప్రజల నాడి పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం సూచించారు. గుండె జబ్బులను నివారించే మిషన్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని సీఎం అన్నారు.

# రేవంత్ వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

సర్దుబాటు చేయనున్నారు. తెలంగాణలో పది జిల్లాలను కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 33 జిల్లాలు చేయగా, జిల్లాల ఏర్పాటు తర్వాత ఏర్పడిన పరిపాలనా అసమతుల్యత, భౌగోళిక సమస్యలు, నియోజకవర్గాల విభజన వల్ల తలెత్తిన ఇబ్బందులు వీటన్నింటికీ పరిష్కారం చూపే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేస్తోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**హుస్నాబాద్‌పై హామీ**

గతంలో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామన్న అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రజల రోజువారీ అవసరాలు, జిల్లా కేంద్రానికి దూరం, రవాణా సౌలభ్యాలు, కరీంనగర్‌తో హుస్నాబాద్ కు ఉన్న అనుబంధం, చరిత్ర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ మార్పు చేపట్టే అవకాశముంది. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా తిరిగి హుస్నాబాద్ ను కరీంనగర్ లో కలపాలని కోరుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ను గెలిపిస్తే కరీంనగర్ లో కలుపుతామన్నారు.

**సమీప జిల్లా కేంద్రాలకే మండలాలు**

పలు మండలాలు ప్రస్తుతం భౌగోళికంగా దూరమైన జిల్లా కేంద్రాలకు అనుసంధానమై ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే సమీపంలోని జిల్లా కేంద్రాలకు మండలాలను కలిపే విధంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టే యోచన ఉంది. ఇది ప్రజాపాలనకు అనుకూలంగా మారుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

**అసెంబ్లీ నియోజకవర్గాల పునఃసర్దుబాటు**

మూడు-నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న కొన్ని



అసెంబ్లీ నియోజకవర్గాలను ఒకే భౌగోళిక ప్రాంతంలోకి తీసుకురావాలన్న ఆలోచన కూడా ఉంది. దీని వల్ల ప్రజాప్రతినిధులకు సమన్వయం సులభమవుతుంది, అభివృద్ధి నిధుల వినియోగం స్పష్టంగా జరుగుతుందన్నది ప్రభుత్వ వాదన. కొడంగల్ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్ రెడ్డిని ఇబ్బందిపెట్టే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రెండు, మూడు జిల్లాలకు నియోజకవర్గాన్ని ముక్కలు చేసింది. ఇపుడు అంతా ఒకేవైపుకు తీసుకువచ్చేలా విభజనలో మార్పులు చేర్పులు జరగనున్నాయి.

**అధ్యయన కమిటీ – త్వరలో నిర్ణయం**

జిల్లాల పునరవ్యవస్థీకరణ కోసం త్వరలోనే ప్రత్యేక అధ్యయన కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. భౌగోళిక పరిస్థితులు, జనాభా సాంద్రత, పరిపాలనా వ్యయాలు, ప్రజాభిప్రాయ అంశాలపై ఈ కమిటీ లోతైన అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

**కొత్త జిల్లాల ప్రతిపాదన**

సికింద్రాబాద్ కేంద్రంగా మరో జిల్లా

ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో మరో జిల్లా ప్రతిపాదనలున్నాయి.

హైదరాబాద్ నగర విస్తరణ, భవిష్యత్ పట్టణీకరణను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. మెట్రోపాలిటన్ పాలనను మరింత సమర్థంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

**కొండగల్ నియోజకవర్గం హద్దుల్లో మార్పు?**

కొండగల్ అసెంబ్లీ నియోజకవర్గం హద్దులు మారే అవకాశం ఉందన్న సంకేతాలు కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. జనాభా పెరుగుదల, అభివృద్ధి అవసరాలను బట్టి ఈ మార్పులు ఉండొచ్చని అంచనా. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు పొంగులేటి సారథ్యంలో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటయ్యే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. రాజకీయ సమతుల్యత, ప్రాంతీయ సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఉపసంఘం కీలక పాత్ర పోషించనుంది. కేవలం జిల్లాల గీతలు మార్చే ప్రయత్నం కాకుండా, పరిపాలనను ప్రజలకు దగ్గర చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ఆలోచనగా ఉంది. ప్రజల అవసరాలు, అభివృద్ధి లక్ష్యాలు, భవిష్యత్ తెలంగాణ ఆకృతి ఈ మూడు అంశాలను కలిపి ఒక సమగ్ర నిర్ణయానికి రావాలన్నదే ప్రభుత్వ సంకల్పం. రానున్న రోజుల్లో ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన ప్రకటన వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నాకు ఇంత విషం ఇచ్చి
# చంపండి



(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ పోస్టింగ్ లో మంత్రుల జోక్యం రాజకీయ జోక్యం ఉండదు. అని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. నన్ను మానసికంగా ఇబ్బంది కి గురి చెయ్యడం కరెక్ట్ కాదు. తప్పుడు వార్తలు వేసి ఏం సాధిస్తారు. నాకు దైవ భక్తి ఎక్కువ.. నేను దేవుణ్ణి నమ్ముతా...అంత దేవుడు చూసుకుంటాడు. డిజీపీ తో మాట్లాడాం.. సమగ్ర విచారణ జరిపి నివేదిక వచ్చిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటాం అన్నారు.

**సంక్రాంతి రద్దీ నేపథ్యంలో జాగ్రత్తలు**

సంక్రాంతి పండుగ వేళ తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గత ఏడాది సంక్రాంతికి సుమారు 9.97 లక్షల వాహనాలు సరిహద్దులు దాటగా, ఈ ఏడాది ఆ సంఖ్య 12 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. హైదరాబాద్‌విజయవాడ మార్గంలో విపరీతమైన రద్దీ ఉండే అవకాశం ఉన్నందున, ప్రయాణికులు హైదరాబాద్‌కర్నూలు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని మంత్రి సూచించారు. "రద్దీ ఒక పరిమితిని మించి పెరిగితే, వాహనాలను టోల్ ఫీజు వసూలు చేయకుండానే అనుమతించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. అయితే, తెలంగాణకు టోల్ ఫ్రీ పర్మిషన్ ఇచ్చేందుకు కేంద్రం నిరాకరించింది, కానీ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి హైదరాబాద్‌విజయవాడ 6 లైన్ల రహదారి పనులను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పిలవడం జరిగిందని వెల్లడించారు.

## హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపడం తథ్యం
### ఇది ప్రజల కోరిక: మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, మహా :** ప్రజల మనోభావాలకు విరుద్ధంగా గత ప్రభుత్వం హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలిపిందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షల మేరకు తిరిగి కరీంనగర్ జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్‌లో అర్బన్ ఫారెస్ట్ పార్కుకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ నాడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, హుస్నాబాద్ కరీంనగర్ జిల్లాలోనే ఉండాలన్నది ఇక్కడి



ప్రజల చిరకాల కోరిక అని గుర్తు చేశారు. గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇక్కడి అంబేద్కర్ సర్కిల్‌లో ప్రజలకు ఇచ్చిన హామీని ఆయన ప్రస్తావించారు. హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలుపుతామని నాడే ప్రకటించామని తెలిపారు. ఇప్పుడు స్థానిక శాసనసభ్యుడిగా ఆ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన లేదా సరిహద్దుల మార్పు ప్రక్రియను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టినప్పుడు హుస్నాబాద్ అంశానికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. భవిష్యత్తులో జిల్లాల మార్పులు, చేర్పులు జరిగే క్రమంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలపడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మహిళా ఐఏఎస్‌లపై దుష్ప్రచారం

**హైదరాబాద్, మహా:** మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్టకు భంగం కలిగించేలా కొన్ని మీడియా సంస్థలు బాధ్యతారహితమైన, దురుద్దేశపూరిత కథనాలను ప్రసారం చేయడాన్ని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ నిరాధార ఆరోపణలను ఖండిస్తూ, ఐఏఎస్ అధికారుల సంఘానికి తమ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సంచలనం సృష్టించడం, పరువు తీయడం అనే ఏకైక లక్ష్యంతో జర్నలిజం ముసుగులో కొందరు మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఐఏఎస్ సంఘం ఆరోపించింది. ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలు, కల్పిత కథనాలతో మహిళా అధికారులను లక్ష్యంగా చేసుకోవడం అత్యంత హేయమని, ఇది తిరోగమన, స్త్రీద్వేషపూరిత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఇలాంటి చర్యలు రాజ్యాంగబద్ధ పాలన, చట్టబద్ధత, ప్రజా సేవ గౌరవానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని అభిప్రాయపడింది. మహిళా అధికారులు ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిజాయితీ, ధైర్యంతో తమ విధులను నిర్వర్తిస్తున్నారని సంఘం గుర్తుచేసింది. కేవలం ఊహాగానాలు, లీకైన లేదా కల్పిత సమాచారంతో వారి ప్రతిష్టను దెబ్బతీయాలని చూడటం నైతికంగా, చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఇలాంటి చర్యల వల్ల వ్యవస్థల మనోస్థైర్యం దెబ్బతినడమే కాకుండా, పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రసారమైన ఆరోపణలన్నీ అవాస్తవమని, దురుద్దేశపూరితమైనవని ఐఏఎస్ సంఘం తేల్చి చెప్పింది. ఇది అధికారుల వ్యక్తిగత గోప్యత, వృత్తిపరమైన గౌరవానికి తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, "మీడియా ట్రయల్" కిందకు వస్తుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని తెలిపింది. ఐఏఎస్ అధికారుల సంఘంతో కలిసి తాము ఈ అంశంపై పోరాడతామని పేర్కొంటూ, సంబంధిత మీడియా సంస్థలు తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఐఏఎస్ సంఘం డిమాండ్ చేసింది. వివాదాస్పద కథనాలను అన్ని డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని కోరింది. భవిష్యత్తులో ఇలాంటి నిరాధార, కల్పిత కథనాలను ప్రసారం చేసే మీడియా సంస్థలు లేదా వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారి గౌరవం, ముఖ్యంగా మహిళా అధికారుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఐఏఎస్ సంఘం స్పష్టం చేసింది.

## బాబు కోసం
# బండ్ల గణేష్
### షాద్ నగర్ టూ తిరుమల పాదయాత్ర

**హైదరాబాద్, మహా:** నిర్మాత, తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేష్ షాద్‌నగర్ నుండి తిరుమల వరకు సుదీర్ఘ మహా పాదయాత్ర చేపట్టనున్నారు. గతంలో, అప్పటి జగన్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడును అరెస్టు చేసినప్పుడు, చంద్రబాబు నాయుడుపై ఎలాంటి మచ్చ పడకుండా ఈ కేసు నుంచి విడుదల కావాలని బండ్ల గణేష్ తిరుమల శ్రీవారికి మొక్కుకున్నారు. ఇప్పుడు తన కోరిక నెరవేరడంతో, బండ్ల గణేష్ తన మొక్కును తీర్చుకోవడం ద్వారా శ్రీవారికి కృతజ్ఞతలు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. ఈ పాదయాత్ర ఈ నెల 19వ తేదీన షాద్‌నగర్‌లోని బండ్ల గణేష్ నివాసం నుండి ప్రారంభమవుతుంది. ఆయన పాదయాత్ర ద్వారా తిరుమల వరకు వెళ్లి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. బండ్ల గణేష్ తన పాదయాత్రను ఘనంగా ప్రారంభించడానికి ప్రణాళిక రచిస్తున్నారు. తన యాత్ర ప్రారంభాన్ని పురస్కరించుకుని ఒక భారీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ పాదయాత్ర దాని ఆధ్యాత్మిక ఉద్దేశ్యం, ప్రయాణించే దూరం కారణంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుందని భావిస్తున్నారు.

## సంక్రాంతి సినిమాలకు
# రేటు ఘాటు

**హైదరాబాద్, మహా :** మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా ప్రీమియర్స్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పెషల్ షోతో పాటుగా టికెట్ రేటు పెంపునకు కూడా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా మెమో జారీ చేసింది. ఈ సినిమా జనవరి 12న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. దీనకి ఒకరోజు ముందు, జనవరి 11 రాత్రి ప్రీమియర్ షో ఉండనుంది. రాత్రి 8గంటల నుంచి 10 గంటల మధ్య షో ను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ షో టికెట్ ధరను రూ.600 (జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించింది. ఇక జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు టికెట్ రేట్లు పెంచుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. ఈ సమయంలో సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర అదనంగా ఉంటుంది. అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా శుక్రవారం రాత్రే ప్రీమియర్ షోతోపాటు టికెట్ పెంపునకు అనమతి ఇచ్చింది. ఏపీలో సంక్రాంతి సినిమాలు అనగనగా ఒకరాజుకు కూడా రేట్లు పెంచారు. సంక్రాంతిని సొమ్ముచేసుకోవాలని నిర్మాతలు హైక్ సాధించారు.

# పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి

**ఢిల్లీ, మహా :** కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఢిల్లీలో ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని భట్టి విక్రమార్క కోరారు. దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే కేంద్ర లక్ష్యాన్ని భట్టి అభినందించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతంగా ఉందని.. 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి తెలిపారు. ''తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. మౌలిక సదుపాయాల కల్పన కోసం జీఎస్‌డీపీలో పెట్టుబడి రేటును 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి. విద్య, వైద్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహా



యించాలి. రాష్ట్రంలో వెయ్యికిపైగా కులాల వారీగా గురుకుల పాఠశాలలు ఉన్నాయి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20శాతానికి చేరింది. 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీకి సిఫార్సు చేసినప్పటికీ 30 శాతమే అందుతోంది'' అని భట్టి తెలిపారు.

**ట్రిపుల్ ఆర్.. మెట్రో సెకండ్ ఫేజ్ కావాలి**


''ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాం. హైదరాబాద్ మెట్రో రెండో దశపై త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరాం. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలు మంజూరు చేయాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును జాతీయ హోదా ఇవ్వాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ.14,100 కోట్లు కేటాయించాలి. రేడియల్ రోడ్ల కోసం రూ.45 వేల కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ.17,212 కోట్లు కేటాయించాలి'' అని భట్టి విజ్ఞప్తి చేశారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో ప్రతిపాదనలపై సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## 90 శాతం
# మునిసిపాలిటీలు గెలుస్తాం
### వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ బాధాకరం
### టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్, మహా:** పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు సాధించామని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించామని... మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని, వాస్తవాలకు దూరంగా ఇలాంటి వార్తలు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి మంత్రులు,



అధికారులు ఈ స్థాయికి చేరుకుంటారని, అలాంటి వారిపై నిరాధారమైన వార్తలు ప్రచురించడం మానేయాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా, శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నిస్తూ, రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని, ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేము రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమయ్యారని, కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్ రావు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారని పేర్కొన్నారు.



## కొలంబియా అధ్యక్షుడిని
## ఫిబ్రవరిలో కలుస్తా :డొనాల్డ్ ట్రంప్

**మహా:** ఫిబ్రవరి ప్రారంభంలో కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోతో సమావేశమవుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. యుఎస్‌లోకి కొకైన్ అక్రమ రవాణాను అరికట్టడంలో త్వరిత పురోగతి సాధించాలని ఆయన పెట్రోను కోరారు. అమెరికా సైనిక బలగాలు దాడి చేసి, వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించిన విషయం తెలిసిందే. అయితే ఆ దాడి జరిగినప్పటి నుంచి, పెట్రోపై కూడా ఇలాంటి చర్యలే తీసుకుంటామని ట్రంప్ బెదిరిస్తూ వచ్చారు. అయితే తాజాగా ఆయన స్వరం మార్చారు. గుస్తావో పెట్రోను శ్వేతసౌధాన్ని సందర్శించమని ఆహ్వానించారు. మరోవైపు గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసేందుకు కుట్రచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు డెన్మార్క్ గట్టిగా హెచ్చరించింది. అగ్రరాజ్యం బలవంతపు చర్యలకు దిగితే తమ సైన్యం తుపాకులతో సమాధానం చెబుతుందని పేర్కొంది. ఎవరైనా తమ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే, ఎవరి ఆదేశాల కోసం వేచిచూడకుండా కాల్పులు జరపాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు డెన్మార్క్ ప్రకటన చేసింది.

## కాంగ్రెస్ పార్టీ
## కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా
# వెలిచాల రాజేందర్
### పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ ఉత్తర్వులు
### సీఎం రేవంత్ కు కరీంనగర్ కార్పోరేషన్ గిఫ్ట్ గా అందిస్తాం వెలిచాల

**కరీంనగర్, మహా:** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జిగా వెలిచాల రాజేందర్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జిగా వెలిచాల రాజేందర్ రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాజేందర్ రావుకు నియోజకవర్గ ఇన్చార్జి నియమానికి సంబంధించి లేఖను అందించారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ఇతర కరీంనగర్ కాంగ్రెస్ నాయకులు, నేతలతో పాటు ప్రతి ఒక్కరికి పేరుపేరునా రాజేందర్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ కరీంనగర్ కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకొస్తానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పిసిసి అధ్యక్షుడు అధిష్టానం పెద్దలు తనపై అతి పెద్ద బాధ్యతను అప్పగించారని వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సైనికుడి వలె కష్టపడి పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రతి పల్లె పల్లెనా ప్రతి వార్డు వార్డునా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. కరీంనగర్లో డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇతర నాయకులు అందరితో కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి



తీసుకెళ్లి కరీంనగర్ కార్పొరేషన్ పై జెండా ఎగరవేస్తామని రాజేందర్రావు ధీమా వ్యక్తం చేశారు. రాజేందర్ రావ్ ను అసెంబ్లీ ఇన్చార్జిగా నియమించడంతో కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. రాబోయే రోజుల్లో తో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుంది. రాజేందర్ రావ్ నియామకంతో కరీంనగర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్లు మాజీ కౌన్సిలర్లు సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు వెలిచాల అభిమానులు సన్నిహితులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ లో ఇక కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని రాబోయే రోజుల్లో రాజేందర్ రావు నాయకత్వంలో నియోజకవర్గ పరిధిలో బ్రహ్మాండంగా పార్టీ ముందుకు సాగుతుందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ANN తెలుగు

మహా పత్రిక 03

ఆదివారం, తిరుపతి | 11-01-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# దళితుల పక్షపాతి కాంగ్రెస్..

- ఇందుకు నిదర్శనమే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కు పదవి
- కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..
- దళితులకు సేవ చేసేందుకు గొప్ప బాధ్యత లభించింది..
- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ..
- అడుగడుగున ఎస్సీ విభాగం చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణకు ఘన స్వాగతం..






**కరీంనగర్ మహా :** కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దళితుల పక్షపాతిగా వ్యవహరిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్నారని కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. టిపిసిసి ఎస్.సి. విభాగం చైర్మన్ గా నియమితులై మొదటిసారి శనివారం కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన మానకొండూర్ ఎమ్మెల్యే, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అడుగడుగున ఘన స్వాగతం పలికారు. జిల్లా సరిహద్దు బెజ్జంకి నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల భారీ ర్యాలీతో నగరానికి చేరుకున్న కవ్వంపల్లి సత్యనారాయణ గారిని చొప్పదండి ఎమ్మెల్యే కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి జిల్లా ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ తదితర నేతలతో కలిసి శాలువాతో సత్కరించి గజమాలతో ఘన స్వాగతం పలికారు అనంతరం ర్యాలీ ద్వారా కోర్టు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకున్న కవ్వంపల్లి సత్యనారాయణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ దళితుల అభ్యున్నతి కోసం కట్టుబడి పని చేస్తూ ఇండ్ల పట్టాలు ఇచ్చి, భూమిలేని పేద దళితులకు ప్రభుత్వ భూములు ఇచ్చి, దళితులను అన్ని రకాలుగా ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అనేక విధాలుగా దళితుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ తోడ్పడింద న్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు అధిష్ఠానం పెద్ద బాధ్యతలు అప్పగించిందని పేర్కొన్నారు. మంత్రి పదవి వెంట్రుకవాసిలో చేజారినా టిపిసిసి ఎస్సి సెల్ చైర్మన్ గా నియమించడం అభినందనీయ మన్నారు. సమర్థతకు మారుపేరు కవ్వంపల్లి సత్యనారాయణ అని దళితులకు మందింత సేవ చేసే భాగ్యం లభించిందన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే, పిసిసి ఎస్.సి.సెల్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్ సి సెల్ చైర్మన్ గా నన్ను నియమించిన జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులు శ్రీమతి సోనియా గాంధీకి రాహుల్ గాంధీకి అఖిల భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఒక్క గౌరవం ఒక గొప్ప పదవి అనడం కంటే దళితులకు సేవ చేసే ఒక గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ఒక సీనియర్ వైద్యునిగా, నిబద్ధత కలిగిన నాయకునిగా, ఒక పట్టుదలగల వ్యక్తిగా గుర్తించి మా రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నన్ను రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ గా నియమించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి తెరదించి ఎస్సీ వర్గీకరణ చేసినారు దళితులంతా శాంతియుతంగా సౌభ్రాతృతంగా సోదర భావంతో ఉండాలని సూచించారు. ఈ రాష్ట్రంలో 17% దాదాపు 70 లక్షల మంది జనాభా ఉన్నటువంటి దళితులంతా స్వాతంత్రం సిద్ధించిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారనీ తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు దళితులంతా కాంగ్రెస్ పార్టీకి స్ఫూర్తిదాయకంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కోడూరు సత్యనారాయణ గౌడ్, ఆరెపల్లి మోహన్,నాయకులు ఎండి తాజ్,కొర్వి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, పులి ఆంజనేయులు గౌడ్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కర్రసత్య ప్రసన్న రెడ్డి,పురం రాజేశం, ఎస్ ఎల్ గౌడ్, గోపు మల్లారెడ్డి,కర్ర రాజశేఖర్ తో పాటు* బ్లాక్ / మండల / పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అనుబంధ సంఘాలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు *రాష్ట్ర & జిల్లా కాంగ్రెస్ ప్రతినిధులు *జిల్లా కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

### గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి



**వరంగల్ మహా;** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సాహిత్య సాంస్కృతిక పోటీలకు సంబంధించిన గోడపత్రిక గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. తెలంగాణ సాంస్కృతిక గ్రామీణ వ్యవసాయ జీవన విధానానికి ప్రతిబింబించే సంక్రాంతిని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం పట్ల నిర్వాహకుల్ని రాజనాల శ్రీహరి అభినందించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు జాతిని, తెలుగు భాషను మరుగున పడుతున్న ప్రస్తుత సందర్భంలో ఇటువంటి భాషా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తెలుగు భాష ఉన్నత్యాన్ని రాబోయే తరాలకు అందించే విధంగా సంస్థ కృషి చేయడాన్ని తోట హరీష్ (తెలంగాణ బులియన్ జ్యువలరీ అండ్ జెంట్స్ ఫెడరేషన్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ & కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు) కొనియాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జడల శివ హరిత మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుండి వరంగల్ నగరంలోని పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియం నందు వ్యాసరచన (అంశము ప్రగతి పథంలో దేశాభివృద్ధి) చిత్రలేఖనం (అంశము: సమైక్య భారతి) కవితలు (అంశము: సంక్రాంతి విశిష్టత విశేషము) ముగ్గుల పోటి రంగవల్లులు (అంశము గొబ్బెమ్మలు హరిదాసు గంగిరెద్దుల, పతంగులు సంక్రాంతి శోభ దృశ్యాలు) పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అందరికీ ప్రశంసా పత్రంతో పాటు ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన దల్చినవారు ఎటువంటి రుసుము లేకుండా పాల్గొనవచ్చునని కాబట్టి మహిళలు విద్యార్థులు కవులు కళాకారులు పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు భుజంగరావు, ఎంఎస్ఎ జ్యువెలర్స్ అధినేత ఎండి అమీర్, గరిమెళ్ళ మదన్ రావు, పిఆర్ ప్రసాద్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే నాయిని

### డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం 52వ డివిజన్ పరిధిలోని వాగ్దేవి కళాశాల వెనుక భాగంలో చేపట్టనున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. డ్రైనేజీ పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు సమస్యలు తగ్గి ప్రజలకు స్పష్టమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. నయీం నగర్ పరిసర ప్రాంతాల్లో నాలాల వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయించిందని, ఈ నెలలోనే పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ప్రజలు మమ్ములను నమ్మి ఓటు వేసి గెలిపించినందుకు చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులు చేస్తామని అన్నారు.



వాగ్దేవి కళాశాలలో సంక్రాంతి సంబరాలు

అనంతరం వాగ్దేవి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలను వెలిగించి ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, అభివృద్ధితో పాటు సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తడుక సుమన్,డైరెక్టర్ శ్రవణ్ రెడ్డి ,నాయకులు సుగుణాకర్ రెడ్డి,అశ్విన్ రాథోడ్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల వలయంలో బీరన్న కుంట

### సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు



**వరంగల్ మహా;** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ నగరం లోని 32 వ డివిజన్ బీరన్న కుంటలో స్థానిక సమస్యల పై ఇంటింటి సర్వే నిర్వహించారు. పలు సమస్యలను స్థానిక ప్రజలు నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ నిర్మించతలపెట్టిన అది పిల్లర్స్ వరకే పరిమితమైందని ఈ నిర్మాణం దాదాపు సంవత్సరం కావస్తున్న ఇంతవరకు పనులు ముందుకు సాగడం లేదని దీనిని త్వరగా పూర్తిచేయాలని అలాగే డ్రైనేజ్ సమస్య గత పది సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉన్నదని దానిని ఇప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించాలని అదేవిధంగా కోయవాడ నుండి కళింగబార్ వరకు 33 ఫీట్ల రోడ్డు చేయాలని కోరారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి డబ్బులు త్వరగా మంజూరు చేయాలని డివిజన్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని గతంలో వేసిన పైపులైన్ వల్ల జనాభా కు అనుగుణంగా సరిపోవడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా బీరప్ప కుంటలో 100 గజాల ఖాళీ స్థలంలో గ్రంథాలయం తోపాటు ఉచిత కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటుకై బిల్డింగ్ నిర్మించాలని కాలనీలో పలుచోట్ల వీధిలైట్లు రావడం లేదని మొత్తానికి బీరప్ప కుంట సమస్యల వలయంలో చిక్కుకుందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బల్దియా అధికారులకు పత్రిక ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు రామన్నపేట కరీమాబాద్ ఏరియా కార్యదర్శి వర్గ సభ్యులు గున్నాల ప్రభాకర్, అప్పాజీ వాణి, మూడేళ్ల ఉపేందర్, ఎనగందుల భాగ్యమ్మ ఎండి మాశుబి. మేకల అరుణ ఎండి మొరంబి బుదారపు అనసూయ, కందగట్ల రోజా, మహేష్, ఎండి జహనా, ఎస్కె జుబేదా, మాచర్ల సక్కుబాయి, ఎండి షాజీరా, భోగం కౌసల్య, జలగం సుగుణ వేముల అరుణ, పద్మ, సంతోష్, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

### ఆసుపత్రికి తరలించిన 108 సిబ్బంది



**హుజూర్ నగర్ మహా:** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని మహీంద్రా షోరూం ఎదుట శనివారం మిర్యాలగూడ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుని క్రాస్ చేస్తూ అతను నడిపే ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పడంతో రోడ్డు ప్రమాదం అదే ప్రాంతానికి చెందిన హెవంత్ రెడ్డి (24) తలకు తీవ్ర గాయాలయ్యాయి.దీంతో స్థానికులు 108 అంబులెన్సు కు సమాచారం అందించడంతో స్పందించిన 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి సరిత, పైలట్ రషీద్ హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కోసం మిర్యాలగూడ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.

## సిపిఐ పార్టీ నుంచి ఎన్నికైన సర్పంచుల ను సన్మానించిన న్యాయవాదులు



**హుజూర్ నగర్ మహా:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గరిడేపల్లి మండలంలోని, గానుగబండ,రంగాపురం గ్రామాలలో సిపిఐ పార్టీ నుండి పోటీ చేసి గ్రామపంచాయతీ సర్పంచులుగా ఎన్నికైన కడియాల పద్మ,కట్టా కళ్యాణి లను,హుజూర్ నగర్ కోర్టు న్యాయవాదులు,గరిడేపల్లి మండల కేంద్రంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు మీ మీద నమ్మకంతో గ్రామపంచాయతీ సర్పంచులుగా వార్డ్ మెంబర్లుగా ఎన్నుకున్నారని వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని, అలాగే గ్రామ ప్రజల సమస్యలను రాజకీయాలకతీతంగా పరిష్కరించి, ప్రజల మన్ననలను పొంది, మరియొకసారి ప్రజల చేత ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేలా పరిపాలన చేయాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వట్టికూటి అంజయ్య, ఆర్వి రమణారెడ్డి,సురేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి, ఎడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, తిరగమల్ల కిరణ్,అంబటి వెంకటరెడ్డి, వేశాల అంజనేయులు, చెవ్వా వెంకన్న, మామిడి శ్రీను, షేక్ నబి సాహెబ్, పంగా గోవిందు,పోకల ఆంజనేయులు, ప్రతాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఎమ్మెల్యే రేవూరి బహిరంగ క్షమాపణ చెప్పాలి

### బీజేపీ పరకాల నియోజకవర్గ ఇంచార్జ్ పగడాల కాళీప్రసాద్ డిమాండ్




**మహా పరకాల:** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న జర్నలిస్టుల పట్ల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గుచేటని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ పగడాల కాళీప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న జర్నలిస్టుల పట్ల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గుచేటని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ పగడాల కాళీప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. శనివారం పరకాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కాళీప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలో నాలుగో స్తంభంగా ఉంటూ, అనేక సాధక బాధకాల మధ్య విధులు నిర్వర్తిస్తూ వార్తలు సేకరించే జర్నలిస్టులను కించపరచడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి జర్నలిస్టుల పట్ల అహంకారపూరితంగా వ్యవహరించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. జర్నలిస్టుల మనోభావాలను దెబ్బతీసిన ఎమ్మెల్యే వెంటనే వారికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. ఎమ్మెల్యే తన నిరంకుశ ధోరణిని వీడి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## వాగ్దేవి హైస్కూల్ లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు






**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ స్థానిక వాగ్దేవి హై స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముగ్గుల పోటీలు,పతంగుల పోటీలు,భోగి పండ్లు పోయడం,గంగిరెద్దుల ఆటలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులతో హరిదాసు వేషధారణ గావించడమే కాకుండా భోగి మంటలు, గొబ్బిలు,రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల ఆట,సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ఆకట్టుకున్నవి. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాల. జ్యోతి బాబు ప్రిన్సిపాల్ నిడిగొండ.గంగాధర్ లు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనేది మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల కలయికని, భవిష్యత్ తరాల వారికి మన సంప్రదాయాలు, కట్టుబాటులు,పండుగలు గుర్తు ఉండేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను వీడిన నాయకులు బిఆర్ఎస్‌లో చేరిక..

### బిఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం – చల్లా ధర్మారెడ్డి..



**పరకాల మహా:** కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు,హామీల అమలు వైఫల్యంతో విసిగిపోయిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ లో చేరుతున్నారని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి అన్నారు దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్,బిజెపి నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేస్తూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు నిజమైన న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోతున్నారని,అందుకే నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, పార్టీలో చేరిన వారిని సముచితంగా గౌరవించి బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానికసంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కూనాటి రామకృష్ణా రెడ్డి,భూపతి రమేష్,కానాల కిషన్ రావు,ముక్కెర సాంబయ్య, నల్ల సాంబయ్య,కొడకండ్ల మల్లారెడ్డి,లక్కిడి రవీందర్ రెడ్డి,గురజాల రాజు,చెట్టుపెల్లి మహేందర్,ఒడుదుల పవన్,లింగంపల్లి సురేష్,జన్ను రాజేందర్,గొల్లపల్లి వినయ్,కన్నెబోయిన ఓదెలు,నానెబోయిన అనిల్,ఒడుదుల మధుకర్,బిజెపి నాయుకులు నానబోయిన రాజయ్య తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,యూత్ నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## జిల్లాల్లో ఉచిత శిక్షణ దరఖాస్తులకు ఆహ్వానం

**వరంగల్ హన్మకొండ మహా;** ఉమ్మడి వరంగల్ జిల్లా లోని డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బి .సి, మైనవరిటీ, దివ్యాంగులు, నిరుద్యోగులకు తెలంగాణ షెడ్యూల్ కులాల ఆధ్యాయన కేంద్రం ద్వారా 5 మాసాల పాటు వివిధ రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల తో పాటు, ఆర్.ఆర్.బి, బ్యాంకింగ్ తో పాటు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకొనుటకు 09.01.2026 నుంచి 30.01.2026 వరకు http://tsstudycircle.co.in/ వెబ్ సైట్ నందు వార్షిక ఆదాయం 3 లక్షల వరకు ఉన్నటువంటి వారు మాత్రమే ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన వారికి 08.02.2026 (ఆదివారం) తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ క్యాస్ట్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారిచే వరంగల్, హన్మకొండలో ఉదయం 11.00 నుండి 1.00 మధ్యాహ్నం వరకు పరీక్ష నిర్వహించబడుతుంది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 20.02.2026 నుంచి 19.07.2026 వరకు RTC కాలనీ వడ్డేపల్లి, హన్మకొండ నందు గల స్టడీ సర్కిల్ లో తరగతులు నిర్వహించబడుతాయి. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి తో కూడిన అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఇంతకు ముందు ఏదేని ప్రభుత్వ సంక్షేమ శాఖ ద్వారా శిక్షణ పొందిన వారు అనర్హులు. పూర్తి వివరములకు http://tsstudycircle.co.in/ లో చూడగలరు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ హన్మకొండ జిల్లా అధికారి బి.నిర్మల షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డా.కె.జగన్ మోహన్ తెలిపారు.

## పథకం పేరు మార్పు కక్ష సాధింపు చర్యనే

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



**హన్మకొండ మహా;** హనుమకొండ డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ పథకం పై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమన్నారు. పేదల కోసం రూపొందించి అమలు చేస్తున్న పథకాలను నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయని, అలాంటి పథకాలను అడ్డుకోవడం పేదల పాలిట శాపంగా మారుతుందన్నారు. పథకాల పేర్లు మార్చాలనే నెపంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం బీజేపీ చేస్తోందని విమర్శించారు. అసలు సమస్య పరిష్కారం కాకుండా పేర్ల రాజకీయాలు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని చెప్పారు. గ్రామాల్లో పనులు నిలిచిపోవడంతో కూలీలు, పేద కుటుంబాలు తీరని అన్యాయాన్ని ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను తుంగలో తొక్కుతూ, అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీఏ యాక్ట్ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు అందరికీ తెలుసని, అలాంటి చట్టాలను కూడా బలహీనపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీతో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పట్ల చేసిన ద్రోహాలను ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నాయకులు కర్తవ్యంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిజంగా అభివృద్ధి జరిగితే, ఇతర రాష్ట్రాలతో పోల్చి చూపాలని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు జరగాల్సి ఉందని, ఆ హామీల అమలుపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పదేళ్లు గడిచినా మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు,ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్టైల్ పరిశ్రమలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం







**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ పరిధిలోని మడికొండ కాకతీయ టెక్స్టైల్ పార్క్‌లో శుక్రవారం టిజిఐఐసి కార్పొరేషన్ ద్వారా సుమారు రూ.11 కోట్ల నిధులతో అంతర్గత రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు* గారు శంకుస్థాపన చేశారు. అనంతరం కాజీపేట మండల పరిధిలోని కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ 7 మందికి లబ్ధిదారులకు చెక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మడికొండ కాకతీయ టెక్స్టైల్ పార్క్ ప్రాంతం పరిశ్రమల అభివృద్ధికి కీలక కేంద్రంగా మారుతుందని, ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సుమారు రూ.11 కోట్ల నిధులతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరగడం వల్ల పరిశ్రమదారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, వర్షాకాలంలో నీటి సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని తెలిపారు. టెక్స్టైల్ రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వర్ధన్నపేట నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడబోమని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. టెక్స్టైల్ పార్క్ లో దశలవారీగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాననీ హామీ ఇచ్చారు పూర్తి స్థాయిలో టెక్స్టైల్ పార్క్ లో ఉన్న కార్మికుల కోసం ఫౌండేషన్ అక్షయపాత్ర ద్వారా కార్మికులకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తాను అన్నారు. అలాగే తర్వలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పించి పార్కులోని ఇండస్ట్రియల్ నడిచే విధంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూరుగోండ శ్రీనివాస్, జోనల్ మేనేజర్ స్వామి, ఎమ్మార్వో బావ్ సింగ్, కాకతీయ టెక్స్టైల్ & వీవర్స్ వెల్ఫేర్ పొదుపు పరపతి పరస్పర సహాయక సహకార సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







# కనిపించకుండా పోయిన క్రేజీ బ్యూటీస్

**చిత్ర పరిశ్రమ ఎవరిని ఎప్పుడు ఏ స్థాయిలో ఉంచుతుందో ఎవ్వరూ చెప్పలేరు. కొంత మంది వరసగా సినిమాలు చేస్తూ మంచి స్థాయిలో ఉంటే, మరికొంత మంది కొన్ని రోజుల పాటు ఇండస్ట్రీని ఏలి, చివరకు మాములుగా మిగిలిపోతారు. అయితే అలాగే ఒకప్పుడు ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేసిన ముద్దుగుమ్మలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమకు దూరమయ్యారు. ఇంతకీ ఆ బ్యూటీస్ ఎవరు అనుకుంటున్నారా?**

**ఇలియానా :** పోకిరి సినిమాతో టాలీవుడ్‌నే షేక్ చేసిన చిన్నది ఇలియానా. గోవా బ్యూటీ తన నడుముతో మొత్తం తెలుగు ప్రేక్షకులనే కట్టిపడేసింది. అందం , అభినయంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. దేవదాసు సినిమాతో ఎంట్రీ ఇచ్చి, పోకిరి, నేను నా రాక్షిసి,శక్తి,ఆట, ఇంకా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది, కానీ అనుకోకుండా ఈ అమ్మడు టాలీవుడ్‌కు దూరమైంది.

**సిమ్రాన్ :** అందాల ముద్దుగుమ్మ సిమ్రాన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం,అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ చిన్నది 2000 సంవత్సరం టాలీవుడ్‌ను ఓ ఊపు ఊపేసిందనే చెప్పాలి. కలిసుందాం రా అనే సినిమాలో నటించి ఇండస్ట్రీ హిట్ అందుకుంది. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటిచి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కానీ ఇప్పుడు ఈ బ్యూటీ తన అభిమానులకు దూరమైంది.

**సోనాలి బింద్రే :** మెగాస్టార్ చిరంజీవి సరసన ఇంద్ర సినిమాలో నటించి, ఇంస్ట్రీ హిట్ అందుకున్న ముద్దుగుమ్మ సోనాలి బింద్రే. ఈ అమ్మడు ఈ సినిమా తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా మురారి మూవీ కూడా ఈ అమ్మడుకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ చిన్నది ఇండస్ట్రీకి దూరమైంది.

**అనుష్క శెట్టి :** ఎన్నో సినిమాల్లో నటించి, తన నటతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ అనుష్క శెట్టి, బ్యూటీ ఒకప్పడు టాలీవుడ్‌లో తన హవా కొనసాగించింది. తర్వాత అనూహ్యంగా సినిమాలకు దూరమైంది. ఈ మధ్యకాలంలో ఘాటీతో పలకరించినప్పటికీ అది ఆశించిన స్థాయిలో విజయం అందుకోలేదు. దీంతో ఈ బ్యూటీ టాలీవుడ్‌కు పూర్తిగా దూరమైనట్లు టాక్.

**భూమిక :** సింహాద్రి సినిమాతో ఇండస్ట్రీ అందుకున్న ముద్దుగుమ్మ భూమిక గురించి ఎంత చెప్పినా తక్కువే. నా ఆటో గ్రాఫ్, వాసు, ఒక్కడు, జై చిరంజీవ, ఖుషీ, మిస్సమ్మ వంటి చాలా సినిమాల్లో నటిచి, మంచి హిట్స్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ ఇంస్ట్రీకి దూరమైంది.

# ప్రేక్షకులందరూ ఎంజాయ్ చేస్తారు: రవితేజ



''భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాన్ని చాలా అద్భుతమైన ఎంటర్‌టైన్‌మెంట్‌తో తీశారు కిషోర్. ఈ సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఈ నెల 13న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' థియేటర్స్‌లో కలుద్దాం. మీరు అందరూ విపరీతంగా ఎంజాయ్ చేస్తారు''అని హీరో రవితేజ చెప్పారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ–''సుధాకర్ చెరుకూరి ఎక్కువ మాట్లాడరు. కానీ, సినిమాని చాలా ఫ్యాషన్‌తో చేశారు. అనిల్ రావిపూడి, హరీష్ శంకర్, బాబీ, కిషోర్.. వీరి డైరెక్షన్లో ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాను. నెక్స్ట్ శివ నిర్వాణతో చేస్తున్నాను. మా ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్, నేను కలిసి 13 సినిమాలు చేశాం. మా సినిమాలన్నీ దాదాపు హిట్ అయ్యాయి. ఈ సినిమాలో మా హీరోస్ చాలా అందంగా కనిపిస్తారు. నన్ను కూడా చాలా అందంగా చూపించాడు కెమెరామేన్ ప్రసాద్ మూరెళ్ల. తనతో తొమ్మిది సినిమాలు చేశాను. డింపుల్, ఆషిక, సునీల్, సత్య, కిషోర్, మురళీధర్, గెటప్ శీను అద్భుతంగా చేశారు. భీమ్స్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు''అని తెలిపారు. కిషోర్ తిరుమల మాట్లాడుతూ–''ఈ సినిమాని చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాను. మా చిత్రం అందరికీ నచ్చుతుంది'' అని పేర్కొన్నారు. ''జనవరి 13న మా బీఎమ్‌డబ్ల్యూ(భర్త మహాశయులకు విజ్ఞప్తి) రైడ్‌కి వెళ్లండి.. అదిరతుంది'' అని సుధాకర్ చెరుకూరి తెలిపారు. ''నాకు డైరెక్టర్‌గా జన్మ, పునర్జన్మ ఇచ్చింది రవితేజగారే. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' బ్లాక్ బస్టర్ అవుతుంది'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ చెప్పారు. ''త్వరలోనే రవితేజగారితో సినిమా చేస్తాను'' అన్నారు డైరెక్టర్ బాబీ. ''ఈ సినిమా చాలా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని డైరెక్టర్ శివ నిర్వాణ పేర్కొన్నారు. ''ఈ మూవీతో కచ్చితంగా బ్లాక్ బస్టర్ కొడుతున్నారు'' అన్నారు డైరెక్టర్ పవన్.

# నాతో నేను పోటీ పడుతుంటాను : సంయుక్త



''బింబిసార, సార్, విరూపాక్ష, డెవిల్: ది సీక్రెట్ ఏంజెట్, అఖండ 2'.. ఇలా నా కెరీర్‌లో నటిగా నేను ఎప్పటికప్పుడు వైవిధ్యమైన పాత్రలే చేస్తున్నాను. భవిష్యత్‌లో బయోపిక్ సినిమాల్లో నటించాలని ఉంది. ఇటీవల హిందీలో 'హక్' (యామీ గౌతమ్ నటించారు) అనే సినిమా చూశాను. కొన్ని సన్నివేశాలకు భావోద్వేగానికి గురై ఏడ్చాను. ఈ తరహా పాత్రలూ చేయాలని ఉంది'' అని చెప్పారు హీరోయిన్స్ సంయుక్త. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న సాయంత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంయుక్త విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్రంలో దియా అనే పాత్రలో నటించాను. తోటియాక్టర్స్‌తో పోలిక పెట్టుకోను. ఎప్పటికప్పుడు నన్ను నేను మెరుగుపరచుకోవడానికి నాతో నేను పోటీ పడుతుంటాను. శర్వాగారి నుంచి మంచి కామిక్ టైమ్‌ను నేర్చుకున్నాను. సాక్షితో మంచి అనుబంధం ఏర్పడింది. రామ్‌గారు క్లారిటీ ఉన్న డైరెక్టర్. అనిల్‌గారు ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్. పూరి జగన్నాథ్–విజయ్ సేతుపతిగార్ల సినిమాలో నటించాను. నేను మెయిన్స్ లీడ్‌లో 'ది బ్లాక్‌గోల్డ్' మూవీ చేస్తున్నాను'' అని తెలిపారు.



# విషయం చెప్పిన అనన్య

తెలుగు ముద్దుగుమ్మ అనన్య నాగళ్ల వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. మల్లేశం సినిమాతో హీరోయిన్ గా మారిన ఈ చిన్నది వరుసగా సినిమాలు చేసి మెప్పిస్తుంది. మల్లేశం సినిమా తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన వకీల్ సాబ్ సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ అమ్మడు నటించిన సినిమాలు వరుసగా విడుదలవుతున్నప్పటికీ అవి హిట్ టాక్ తెచ్చుకోలేకపోతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనన్య ఆసక్తికర కామెంట్స్ చేసింది. అనన్య ముంబై నుండి వచ్చిన వారికి అవకాశాలు త్వరగా లభిస్తాయని అన్నారు. అయితే, తెలుగు అమ్మాయిలకు ఇండస్ట్రీలో లాంగ్ కెరీర్ ఉంటుందని ఆమె గట్టిగా నమ్ముతున్నట్టు తెలిపింది. తెలుగు అమ్మాయిలం లాస్ట్ ఐదు, ఆరు సంవత్సరాల నుంచే వస్తున్నాము. మరో ఐదు సంవత్సరాల తర్వాత చూసుకున్నా మేము ఇక్కడే ఉంటాము అని ఆమె అన్నారు. మొదట్లో తానూ ముంబై నుండి వచ్చిన వారికి ఎక్కువ అవకాశాలు వస్తాయనుకున్నానని, కానీ గత రెండు సంవత్సరాలుగా తన తన ఆలోచన మారింది అని అనన్య తెలిపింది. వారికి ఎక్కువ అవకాశాలు వచ్చినా, తెలుగు నటీమణులకు కెరీర్‌లో నిలదొక్కుకునే అవకాశం ఎక్కువ ఉంటుందని అనన్య తెలిపింది. అలాగే మల్లేశం, ప్లే బ్యాక్, వకీల్ సాబ్ వంటి సినిమాలలో సాంప్రదాయక పాత్రలలో కనిపించిన అనన్య, తన లుక్ ను మార్చుకోవడం గురించి మాట్లాడుతూ.. మొదట్లో ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫ్యాషనబుల్ ఫోటోలు ఉన్నప్పటికీ, ఈ మూడు సినిమాల తర్వాత ప్రజలు తనను కేవలం సాంప్రదాయక నటిగానే చూశారని తెలిపింది. శాకుంతలం చిత్రం షూటింగ్ సమయంలో గ్లామరస్ ఫోటోషూట్స్ చేయడం వల్ల తనలో బిడియం పోయిందని తెలిపింది.. నటులు 360 డిగ్రీలలో అన్నింటినీ అన్వేషించాలని తెలిపింది. అందుకే సోషల్ మీడియాలో గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తున్నా అని తెలిపింది. అలాగే ఇటీవల సైమా అవార్డ్స్ లో ఆమె గ్లామరస్ లుక్ గురించి మాట్లాడుతూ.. పబ్లిక్ ఈవెంట్ లో అంత గ్లామరస్ గా కనిపించడం తనకు అదే మొదటిసారి అని అనన్య తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034